

# విజయం వెనుక

**– ఆదిరెడ్డి మావుళ్ళు**

గట్టిగా కళ్ళు మూసుకున్నాను. మరుక్షణాన ఎందుకో మళ్ళీ కళ్ళు తెరిచి చుట్టూ పరికించి చూశాను. నిర్జన ప్రాంతం. మిట్ట మధ్యాహ్నం ఊరికి దూరంగా చిట్టడవిలా చెట్లూ పొదలతో నిండివున్న ప్రదేశం.

నా పథకాన్ని అమలుపరచుకోడానికి యిదే అనువైన ప్రాంతం. చెట్టు కొమ్మకి గట్టిగా కట్టిన తాడు రెండోకొస నా మెడకు బిగించుకున్నాను. కాళ్ళ కింద రాళ్ళు ఒకదానిపై ఒకటి పేర్చి అమర్చుకున్నాను. ఏమాత్రం కాళ్ళు కదిపినా రాళ్ళు కదిలిపోతాయి. మెడకున్న తాడు బిగిసి క్షణాల్లో నేను మృత్యు కౌగిలిలోకి చేరుకుంటాను. ఈలోగా ఎవరూ తనను చూడకూడదు. చూస్తే..... తన ప్రయత్నం విఫలమవుతుంది. అప్పుడు తను మళ్ళీ చచ్చినట్టు బతకాలి. అది తనకిష్టం లేదు. అందుకే ఆత్రంగా మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

ఎన్నో ఆశలు..... ఆశయాలతో బతికిన నేను యిలా అర్ధాంతరంగా జీవితాన్ని ముగించుకోవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. అనుకోనిది జరగడమే జీవితమని నాకూ అనుభవంలో కొచ్చింది. లేకపోతే నేననుకున్నదేమిటి? జరిగిందేమిటి? ఇప్పు డదంతా తవ్వుకొని బాధపడే సమయం లేదు నాకు. నా పని నిరాటంకంగా పూర్తి చేస్కోవడమే నాకు మిగిలిన చివరి కార్యక్రమం.

కాళ్ళ దగ్గర ఏదో శబ్దం వినబడితే అనుకోకుండానే మళ్ళీ కళ్ళు తెరిచాము. చిరుగాలికి రెపరెపలాడుతూ చెల్లా చెదురుగా పడి వున్న కాగితాలు.... వాటిలోని అక్షరాలు నాకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'నా యీ జీవిత సాఫల్యానికి మూల కారణం నా భార్యే....' ఆ వాక్యాలపై చిరు దరహాసాలు చిందిస్తున్న ఓ ప్రముఖుని ఫోటో. అతను ప్రపంచంలో పేరొందిన గొప్ప సంగీత విద్వాంసుడు.

అలాగే మరొక సాహితీ వేత్త.... యింకో శాస్త్రవేత్త..... అందరూ తమ విజయాలకు కారకులయిన తమ తమ సహధర్మచారులను, సభలూ, సన్మానాలు సందర్భంగా సగర్వంగా ప్రకటించుకున్న పేపరు కటింగులు.... అవన్నీ నన్ను అవహేళన చేస్తున్నట్టు.... నా అపజయానికి అవమానం చేస్తున్నట్టు..... భరించలేక రెండు చేతులతో గుండెల్ని అదుముకున్నాను.... షర్టు జేబులో మడిచిన కాగితం..... తీసి చూశాను.

బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞా వంతుడు.... పండితుడూ అయిన నిరంజన్ ఫోటో వున్న కాగితం.... నిన్న తనకు జరిగిన బహిరంగ సన్మాన సభలో తన విజయానికి కారణం తన భార్యేనని చెప్పుకున్నాడు. నా కళ్ళంట నీళ్ళు బొటబొటా కారిపోతున్నాయి. ఏదో తెలియని ఆత్మ న్యూనతా భావం నాలో అణువణువునా చోటు చేసుకుంది.

జీవితంలో నాకు జరిగిన అన్యాయం నా కళ్ళ ముందు కదలాడింది. అందరి లాగే, నేనూ ఎందుకు విజయం సాధించలేకపోయాను? నన్ను ప్రోత్సహించి నా ఉన్నతికి ఊతమివ్వాల్సిన నా భార్య అడుగడుగునా నన్నెందుకు నిరుత్సాహ పరచింది? నీరుగార్చి, నీరసపరచి ఆమె సాధించిందేమిటి?



## ఇంత వద్దు

"టబూ మూలంగానే [illegible] పోయింది. మహేష్ మంజ్రేకర్ సినిమాలో మేం కలిసి నటిస్తున్నాం. టబూ ఎంత ఫ్రెండ్లీగా వుంటుందో అంత సీరియస్‌గా వుంటుంది. ఇంతకుముందు ప్రొడ్యూసర్ల ముందు టెర్మ్స్ అండ్ కండిషన్స్ చెప్పాలంటే భయపడేది. ఇపుడటువంటిదేం లేదు. నిర్మొహమాటంగా చెప్పగలుగుతుంది. టబూని చూస్తే ముచ్చటేస్తుంది" అంటోంది మాధురి.

(ఎంత టబూతో నటిస్తే మాత్రం ఇంత ప్రదర్శించాలా?)

అందరికీ నచ్చిన నా కళా వైపుణ్యం, ప్రజ్ఞాపాటవాలు ఆమె దృష్టిలో పూచిక పుల్లలయి పోయాయి. నా పాట ఆమెకు అర్థం లేని అరుపు.... నా రచనలు ఒట్టి పిచ్చి రాతలు. సంగీత, సాహిత్యాలలో అఖండమైన ఖ్యాతి గడించాలని నేను పడ్డ తపన నా భార్య కారణంగా అణగారి పోయింది. అందరి విజయాలకు కారణం తమ తమ భార్యలయితే, నా పతనానికి నా అర్ధాంగే మూల కారణం. అందుకే యింక నేను జీవించి సాధించే దేమిటి?! హే.... భగవాన్! వచ్చే జన్మలోనైనా నాకు తగిన అర్ధాంగినియ్యి.... కళ్ళు మూసుకొని కాళ్ళ కింద రాయిని నెమ్మదిగా కదిలించబోతుంటే..... ఏదో శబ్దం... హఠాత్తుగా కళ్ళు తెరిచి చూశాను. అల్లంత దూరాన వున్న బావిలో అలల అలికిడి.

ఎవరైనా నూతిలో పడ్డారా...?! మెడనున్న తాడు తొలగించుకొని రాళ్ళపై నుంచి ఒక్క ఉదుటున గెంతి నూతి దగ్గరకు పరుగు తీశాను.

నూతిలోకి తొంగి చూసేను. ఏమీ కనిపించలేదు. నూతి ఒడ్డున ఓ రాయి కింద పెట్టిన కాగితం నాకంట పడింది. తీసి చూశాను. ఎవరో రాసిన అక్షరాలు.

'నిజానికి నా విజయానికి నేను చెప్పినట్టుగా నా భార్య కాదు మూలకారణం. ఇన్నాళ్ళూ, యిన్నేళ్ళూ నా అభిమానులకు అబద్ధం చెప్పి మోసం చేశాను. నా భార్య పోరును భరించలేక స్వాంతనకోసం నాకు నేనుగా చేసిన కృషి ఫలితమే నా విజయానికి కారణం. ఆమె పేరు చెప్పి తాత్కాలికంగానైనా ఆమె మెప్పు పొందాలని యిన్నాళ్ళూ ఆత్మవంచన చేసుకున్నాను. అందుకే ఆత్మహత్య చేస్కుంటున్నాను.

ఇట్లు

నిరంజన్

అయ్యో! ఎంత ఘోరం జరిగిపోయింది. నిరంజన్ ఆత్మహత్య చేసుకున్నాడా....? ఆ నిజాన్ని భరించలేని నా మనసు బాధతో విలవిలలాడిపోయింది. నాలో అంతులేని నీరసం.... కళ్ళు బైర్లు కమ్మిపోయి ఉన్న ఫళంగా అక్కడే కూలి నేలపై పడిపోయాను. అలా ఎంతసేపుండిపోయానో నాకే తెలీదు.

ఎవరో ముఖంపై నీళ్ళు చిలకరిస్తుంటే మెలకువొచ్చి మెల్లగా కళ్ళు తెరిచాను. ఎవరో అపరిచిత వ్యక్తి.... నా కళ్ళలోకి సూటిగా చూస్తున్నాడు.

'పిచ్చివాడా! అన్యాయంగా ఆత్మహత్యకు పాల్పడతావా? ఇన్నాళ్ళూ నిన్నొక గొప్పవాడిగా భావించాను. నీకున్న అశేష అభిమానుల్లో నేనూ ఒకణ్ని. ఎప్పుడూ చూడకపోయినా నీ పాటలు వింటూ, నీ రచనలు చదువుతూ నీలోని బహుముఖ ప్రజ్ఞకు మురిసి ముగ్ధుడై పోయేవాడిని. కాని నువ్వూ ఒక సామాన్య మానవుడివేనని, నీకూ అందరి లాగే బలహీనతలున్నాయని యిప్పుడు తెలుసుకున్నాను. ఏం...? మగవాడి విజయం వెనుక ఆడదే వుండాలా? నీ భార్య నీకు సహకరించనంత మాత్రాన నువ్వు గొప్ప వ్యక్తివి కాకుండా పోయేవా? నీ విజయానికి నీ భార్యే కారణమని అబద్ధమాడినందుకు అదేదో గొప్ప నేరంగా భావించి, పిరికి వాడిలా ఆత్మహత్యకు పూనుకుంటావా? చచ్చి ఏం సాధించాలని? నూతిలో పడక ముందే స్పృహ తప్పి పడిపోయిన నువ్వు నిజంగా చనిపోవడానికి మానసికంగా సిద్ధం కాలేదని ఋజువయ్యింది.

బాబూ నిరంజన్! నీకింకా గొప్ప భవిష్యత్తుంది. నాలాంటి అభిమానులకోసమైనా నువ్వు కలకాలం బ్రతకాలి! నీ కళానైపుణ్యంతో యీ జగత్తంతా దివ్య తేజస్సుతో నిండిపోవాలి! అందుకు నీ భార్య సహకారమే ఉండనక్ఖర్లేదు. నీ మీద నీకు నమ్మకముంటే చాలు. నీ మనసే నీ ప్రగతికి సోపానం." అంటూ అతను లేచి వెళ్ళిపోయాడు. అతను నా చేతిలోని నిరంజన్ చీటి చూసి, నేనే నిరంజన్‌నని భ్రమపడినట్లున్నాడు.

అయితే అతని మాటలు నాకు జ్ఞానోదయాన్ని కలిగించాయి. కాని ఆ ఆనందం నాలో ఎంతోసేపు నిలవలేదు. అప్పుడే నూతిలో నీటిపై కొచ్చిన నిరంజన్ శవాన్ని చూశాక.

నిరంజన్ రాసిన కాగితాన్ని పట్టుకొని పోలీస్ స్టేషనుకు బయల్దేరాను. ❋

